జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటా..

'నమస్తే'తో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

- ఇకపై ప్రతిరోజు ప్రజా ఫిర్యాదుల విభాగం ఉంటుంది..
- సంక్షేమ పథకాలన్నీ అర్హులకే అందేటట్టు పకడ్బందీ చర్యలు
- కలెక్టర్‌గా పనిచేసే అవకాశం దక్కడం మర్చిపోలేనిది..
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూన్ 22(నమస్తే తెలంగాణ) : తాను జిల్లా కలెక్టర్‌గా కాకుండా ఈ జిల్లా ప్రజలందరి సేవకురాలిగా నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని, అలాగే అభివృద్ధి, సంక్షేమ ఫలాలన్నీ అర్హులకు అందించడమే తన ధ్యేయమని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. నూతన కలెక్టర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆమెను శనివారం 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూ చేసింది. తనకు మొట్ట మొదటి సారి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం రావడం ఎప్పటికీ మర్చి పోలేనిదన్నారు. నిర్మల్ కలెక్టర్‌గా తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇక్కడి ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రతి సోమవారం మాత్రమే ప్రజా ఫిర్యాదుల విభాగం కొనసాగగా, ఇకపై ప్రతిరోజు ఈ విభాగాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించేందుకు ప్రతిరోజు ఫిర్యాదుల విభాగం తోడ్పడుతుందన్నారు. ఇప్పటికే చాలా మంది ప్రజలు రకరకాల సమస్యలతో కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారికి అక్కడి కక్కడే పరిష్కారమార్గం చూపే బాధ్యత తమపై ఉందన్నారు. జిల్లాలో అందరి సమ న్యయంతో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సుపరిపాలనను అందించడమే తన ముందున్న లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలన్నీ జిల్లాలో పక్కదోవ పట్టకుండా చూస్తానని 'నమస్తే'తో వెల్లడించారు.

నమస్తే : కలెక్టర్‌గా మొట్టమొదటి సారి బాధ్యతలు చేపట్టారు. అనుభూతి ఎలా ఉంది?

కలెక్టర్ : చాలా సంతోషంగా ఉంది. నిర్మల్ జిల్లా ప్రజలకు సేవ చేసేందుకు ఇదో గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎప్పుడైనా కలెక్టరేట్‌కు రావచ్చు. ఇంతకు ముందు ప్రతి సోమవారం మాత్రమే ఫిర్యాదులను స్వీకరించేవారు. ఇకపై సోమవారంతోపాటు మిగతా రోజుల్లో కూడా ప్రజాఫిర్యాదులను తీసుకునేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. సమస్య ప్రాధాన్యతను బట్టి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

నమస్తే : ఒక మహిళా ఐఏఎస్‌గా మీరు మహిళ లందరికీ స్ఫూర్తి కదా? ఐఏఎస్ కావాలని ఎందుకు అనిపించింది?

కలెక్టర్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఒక మహిళగా తనవంతుగా సాటి మహిళలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతోనే ఐఏఎస్ కోసం ప్రిపేర్ అయ్యా. విజయం సాధించా. జిల్లా వ్యాప్తంగా ఉన్న పేద, మధ్య తరగతికి చెందిన గర్భిణులు, బాలింతలతోపాటు చిన్న పిల్లలకు మంచి పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటా. అలాగే యువతులు, మహిళలకు వారు ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యత శిక్షణ ఇచ్చి స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటాం. ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలిస్తాం.

నమస్తే : జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ శాఖల నడుమ సమన్వయం లేదు. అవినీతి పెరిగిపోయిందన్న ఆరోపణలు వస్తున్నాయి. దానిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్ : అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అలాగే శాఖల మధ్య సమన్వయలోపం లేకుండా చూస్తా. సమన్వయంతో పని చేసినప్పుడే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సకాలంలో ప్రజలకు అందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఒకవేళ అలాంటి ఘటనలు జరిగితే తన దృష్టికి తీసుకురండి. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం.

నమస్తే : జిల్లాలో చాలా చోట్ల ప్రభుత్వ, చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్ : ప్రభుత్వ భూములను ఆక్రమించేవారు ఎంతటి వారైనా సరే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఆక్రమణలను గుర్తిస్తాం. అక్రమార్కుల చెరలో ఉన్న భూములను విడిపించి తిరిగి ప్రభుత్వానికి చెందేలా చూస్తాం.

నమస్తే : వానకాలం ప్రారంభమైంది. రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. నేటికీ రైతుభరోసా రాలేదు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వీటిపై రైతాంగానికి ఏవిధంగా భరోసా కల్పిస్తారు?

కలెక్టర్ : పెట్టుబడి సాయం కింద అందజేసే రైతుభరోసాపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను నిరోధించేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తాం. ఇందుకోసం వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేస్తాయి. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారి దుకాణ లైసెన్సును రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడం.

జూడాల ధర్నా

కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

- కండ్లకు గంతలు కట్టుకుని నిరసన
- 24వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలి..
- లేకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరిక

తమ న్యాయమైన డిమాండ్లను ఈనెల 24వ తేదీలోగా పరిష్కరించకపోతే విధులను బహిష్కరిస్తామని జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్‌చారి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే శనివారం రిమ్స్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట కండ్లకు గంతలు కట్టుకుని జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సందీప్‌చారి మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని గుర్తు చేశారు. అయినప్పటికీ స్పందన రాకపోవడంతో విధులు నిర్వహిస్తూనే ఆందోళన కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి రెండు, మూడు నెలలకోసారి ధర్నా, నిరసన చేస్తేనే ఉపకార వేతనాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కార్తీక్, సూరజ్, కోశాధికారి మురుగన్, సభ్యులు రష్మి పాల్గొన్నారు. - ఎదులాపురం, జూన్ 22

కేసులు పెడతాం..

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధి, సిరసన్న రైతులతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

- రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న అటవీశాఖ అధికారులు
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

దశాబ్దాలుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న వారిపై అధికారులు ధౌర్జన్యాన్ని ఆపాలని, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ కేసులు పెడతామనడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు లంక రాఘవులు అన్నారు. శనివారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట బేల మండలంలోని బాధి, సిరసన్న గ్రామాల రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు చేసుకుంటున్న భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటడానికి భూమిని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అది రెవెన్యూ భూమి అని, ఇప్పటికే బ్యాంకులు రుణాలు ఇచ్చాయని, అధికారులకు పట్టాలు ఇచ్చేందుకు సర్వేలు కూడా చేశారని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశన్న, భీంరావు ఉన్నారు. - ఎదులాపురం, జూన్ 22

విపత్తు సామగ్రిని సిద్ధం చేయిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ జానకి షర్మిల

విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసు సేవలు

త్వరలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో శిక్షణ

- ఇప్పటికే 70 మందికి పూర్తి.. మరికొందరికి కూడా..
- అందుబాటులో లైవ్ జాకెట్స్, ట్యూబ్స్, రోప్స్

నిర్మల్ అర్బన్, జూన్ 22 : పోలీసులు అనగానే శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణే గుర్తుకొస్తాయి. కానీ.. నిర్మల్ జిల్లా పోలీసులు శాంతి భద్రతలతోపాటు విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లావాసులకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఎస్పీ జానకి షర్మిల పోలీసులకు శిక్షణ ఇప్పించేందుకు బ్యాచ్‌లను సిద్ధం చేశారు. శిక్షణకు ఇప్పటికే పోలీసు శాఖలో నిష్ణాతులైన వారిని గుర్తించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శిక్షణ ఇచ్చినట్లయితే వరదల సమయంలో సహాయక చర్యలు అందించేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. ఏయిర్ బోట్స్‌లో శిక్షణ ఇచ్చి, విపత్తుల నుంచి రక్షించేందుకు, ప్రాణనష్టం జరుగకుండా పోలీసులు అండగా నిలవనున్నారు.

త్వరలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో శిక్షణ

విపత్కర పరిస్థితుల్లో జిల్లావాసులను కాపాడేందుకు త్వరలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో జిల్లా పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం నిర్మల్ పట్టణంలోని వినాయక్ సాగర్(బంగల్‌పేట్ చెరువు)ను అధికారులు ఎంపిక చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్నవారిని రక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వెళ్లడం ఆలస్యంకానుండడంతో తక్షణ సహాయం అందించేందుకు జిల్లా పోలీసులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు ఇచ్చే శిక్షణనే పోలీసు సిబ్బందికి అందించనున్నారు. ఇందుకోసం నిర్మల్ జిల్లాకు త్వరలో రెండు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రానున్నాయి.

ఇప్పటికే 70 మంది పూర్తి.. మరి కొందరికి కూడా..

నిర్మల్ జిల్లాలో కడెం, గడ్డెన్న వాగు, స్వర్ణ జలాశయాలు ఉన్నాయి. ఒక్కసారిగా భారీ వర్షం కురిసినట్లయితే వర్షంతోపాటు ఎగువ ప్రాంతాల్లోని వరద నీరు ప్రాజెక్టుల్లోకి చేరుతున్నది. దీంతో గతేడాది కడెం ప్రాజెక్టు కూలిపోయే దశకు చేరుకున్నది. అదే జరిగితే దాని దిగువన ఉన్న అనేక ప్రాంతాలు జలమయం అయ్యేవి. అదే జరిగినట్లయితే ధన నష్టంతోపాటు ప్రాణనష్టం కూడా జరిగేది. ఇలాంటి విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని పోలీసులు రక్షించనున్నారు. గతేడాది 70 మంది పోలీసులు శిక్షణ తీసుకోగా.. ఈ యేడాది 70 మంది పోలీసులతోపాటు మరి కొంత మందికి శిక్షణ అందించనున్నారు.

అందుబాటులో విపత్తు సామగ్రి

విపత్కర పరిస్థితుల్లో జిల్లావాసులను రక్షించేందుకు సాయుధ దళ కార్యాలయంలో పోలీసులు సామగ్రిని సిద్ధం చేశారు. వీటిని ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. ఇప్పటికే జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఎయిర్ బోట్స్(మోటార్) రెండు అందుబాటులో ఉన్నాయి. వరదల్లో చిక్కుకున్న 15 మందిని ఒకే సారి సురక్షితంగా దీంతో ఒడ్డుకు చేర్చవచ్చు. లైవ్ జాకెట్స్ 100, ట్యూబ్స్ 50, అవసరమైనన్నీ రోప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటినీ పోలీసు అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

అండగా నిలిచేందుకే..

విపత్కర పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం పోలీసు సిబ్బందికి త్వరలో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నాం. నిష్ణాతులైన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు త్వరలో జిల్లాకు రానున్నాయి. బృందాలవారీగా శిక్షణ అందించేందుకు రెడీ అవుతున్నాం. గతంలో శిక్షణ తీసుకున్న వారికి కూడా మరోసారి శిక్షణ ఇస్తాం. వరదల సమయంలో జిల్లా పోలీసుల సహాయాన్ని తీసుకోవచ్చు.

- డాక్టర్ జానకి షర్మిల, ఎస్పీ.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాంసి, జూన్ 22 : ఈదుల్లా సవర్గాం మాజీ సర్పంచ్ భరత్ తండ్రి, భీంపూర్ మండలంలోని అర్లి(టీ) గ్రామ మాజీ ఎంపీటీసీ గొల్లి రామయ్య, భీంపూర్ సమాజ్ కారోబారు ఆడె తారచంద్ భార్య ఇటీవల మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మూడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి వెంట జడ్పీటీసీ సుధాకర్, బీఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, నాయకులు సంజీవ్‌రెడ్డి, లక్ష్మన్న, గోవర్ధన్ యాదవ్ ఉన్నారు.

అర్లి(టీ)లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

విద్యుత్ శాఖ ఏడీ సర్వీస్ నుంచి తొలిగింపు

ఆదేశాలు జారీ చేసిన సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎదులాపురం, జూన్ 22 : టీజీఎన్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్స్)గా పనిచేస్తూ ఏసీబీకి దొరికిన రేగుంట స్వామిని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్‌డీ) ప్రకటన విడుదల చేశారు. 2010లో ఆదిలాబాద్ రూరల్ సబ్ డివిజన్ ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన రైతులకు తాత్కాల్ స్కీం విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.30 వేల లంచం డిమాండ్ చేశారు. తాము అన్ని డబ్బులు ఇచ్చుకోలేమని రైతులు చెప్పగా రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రైతులు ఏసీబీ అధికారులను సంప్రదించగా వారు ఏడీఈ లంచం తీసుకుంటుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించగా, సాక్ష్యాధారులు పరిశీలించిన న్యాయమూర్తి, ఏడీఈ స్వామికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ ఏప్రిల్ 10, 2024 రోజు తీర్పు చెప్పారు. ఈ మేరకు ఏడీఈపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 22 : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అమ్మా ఆదర్శ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, మహిళా శక్తి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి' లక్ష్యంతో వచ్చే ఐదేండ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమాలు చేపట్టడానికి మండలాలవారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వివిధ మండలాలలో మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కాగా.. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులపై ఆరాతీసి ఈ నెల 30వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, అధికారులు ఉన్నారు.

పరీక్షలకు రెడీ

టీజీపీఎస్సీ సీబీఆర్టీ హాస్టల్ వెల్ఫేర్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్(గ్రేడ్2) పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫసర్ పరీక్ష.. జూన్ 30 నుంచి జూలై 4వ తేదీ వరకు డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయి. నలందా డిగ్రీ, పీజీ కాలేజీ.. మావలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానకి చేరుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. పోలీసు బందోబస్తుతోపాటు అబ్జర్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేకాధికారులను నియమించామని తెలిపారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని.. ఉదయం, సాయంత్రం బస్‌లు నడిచేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఎస్‌వో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

పునరావాస ప్రజలకు అండగా ఉంటాం..

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

పునరావాస ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం, జూన్ 22 : పునరావాస ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, అండగా ఉంటామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కడెం మండలంలోని మైసంపేట, రాంపూర్ గ్రామ ప్రజలను పునరావాసం కింద మద్దిపడగ గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను శనివారం ఆమె పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నష్టపరిహారం కింద ప్రజలకు అందించిన భూమిని సాగుకు యోగ్యంగా చదును చేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఖాళీ చేసిన గ్రామాల్లోని పాఠశాలలను ఇక్కడికి తరలించాని ఆదేశించారు. పునరావాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మురికి కాలువపై పైకప్పు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అటవీశాఖ ఆధికారి ప్రసాద్, ఆర్డీవో రత్న కల్యాణి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.